క్లుప్తంగా

పెద్దమ్మ ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండలంలోని కొత్తవెంకూర్ పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. అంతకుముందు బోనం వండి నైవేద్యం సమర్పించారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల ఆహ్వానం

లక్ష్మణచాంద: మండలంలో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు దరఖాస్తు ఫారంతోపాటు రేషన్‌కార్డు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయం, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను ఎంపీడీవో కార్యాలయంలో అందించాలని కోరారు. అర్హులు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సభ్యత్వ నమోదు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌లో ఆదివారం తెలంగాణ మున్నూరుకాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మున్నూరుకాపులు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈ.గంగాధర్, బి.శ్రీనివాస్, సలహాదారులు టి.నరేంద్రబాబు, జె.గజేందర్, ఉపాధ్యక్షులు ఎం.సురేందర్, ఖానాపూర్ డివిజన్ ఇన్‌చార్జి కె. శ్రీనివాస్ తదితరులున్నారు.

'అడెల్లి' ఆలయంలో పూజలు


మొక్కులు చెల్లించుకుంటున్న రామారావ్

సారంగాపూర్: జిల్లాలో ప్రాచీన ఆలయమైన అడెల్లి మహాపోచమ్మ బాలాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవార్ రామారావు పటేల్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వాదం ఇచ్చి అమ్మవారి తీర్థప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, గంగారెడ్డి, వెంకట్‌రావు పటేల్, సుభాశ్ పటేల్, పృథ్విపటేల్, రఘు పటేల్ తదితరులు ఉన్నారు.

వాహనపత్రాలు కలిగి ఉండాలి


డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై సందీప్

తానూరు: వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు అన్ని పత్రాలు కలిగి ఉండాలని ఎస్సై సందీప్ అన్నారు. ఆదివారం మండలంలోని జౌలా(బి) గ్రామ సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనపత్రాలు పరిశీలించి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. అనంతరం వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలు, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

క్షీరాభిషేకం

కుంటాల: రైతులకు రుణమాఫీ ప్రకటించినందుకు మండలకేంద్రంలో ఆదివారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు కాశీరాం గజేందర్, సురేశ్, కల్యాణ్, సదాశివ్, లింగం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

32వ రోజుకు సమ్మె


సమ్మెలో పాల్గొన్న కార్మికులు

ఖానాపూర్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 32వ రోజుకు చేరింది. మండల కేంద్రంలో దీక్ష వద్ద కార్మికులు మాట్లాడారు. చాలీచాలని వేతనంతో ఇబ్బంది పడుతున్నామని.. ప్రభుత్వం న్యాయం చేయాలని వేడుకున్నారు. నాగరాజు, పోశెట్టి, రవి, స్వామి పాల్గొన్నారు.

స్నేహితుల దినోత్సవం

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ఎంపీపీ చాంబర్‌లో ఆదివారం మహిళా ప్రజాప్రతినిధులు స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. ఎంపీపీ అడ్వాల పద్మ, ఎంపీటీసీలు రమ, అనిత, సర్పంచ్‌లు శ్రీవిద్య, హైమావతి, రాజవ్వ, లలిత తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ సార్‌కు నివాళి

- ఊరూరా మహనీయుడి జయంతి
- వేడుకల్లో పాల్గొన్న నాయకులు, అధికారులు


సోన్ మండలం న్యూవెల్మల్‌లో మహనీయుడి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

నిర్మల్‌టౌన్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ సేవలు మరువలేనివని పోలీస్ అధికారులు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్, జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ జాతిపిత జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు రమేశ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం మహనీయుడు చేసిన త్యాగాలను వివరించారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మనోజ్, బీసీ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దేవిశ్రీనివాస్, శివ తదితరులు ఉన్నారు.

తానూరు: మండల కేంద్రంతోపాటు ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు మాధవ్‌రావ్, దయానంద్, ఏఫ్ఏ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సై హన్మాండ్లు, ఎస్సైలు రాందాస్, దేవరావు పోలీసులు పాల్గొన్నారు. కల్లూరు నిర్వహించిన వేడుకలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని జయశంకర్ కాలనీలో జయశంకర్ జయంతి నిర్వహించారు. అనుసూరి శ్రీనివాస్, బెజ్జంకి రవి, రంగు శ్రీనివాస్ తదితరులున్నారు. స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో కార్యకర్తలు జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. భైంసా పట్టణంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎన్.శ్రీహరి, కార్యదర్శి ఆకాశ్, నాగభూషణ్ తదితరులున్నారు.

కడెం: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జయశంకర్ సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్, పట్టణాధ్యక్షుడు వాజీద్‌ఖాన్, రఫీక్, భూషణం, బబ్లూ, రమేశ్, చాంద్‌పాష ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో జయశంకర్ జయంతి నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

సారంగాపూర్: ఎంపీడీఓ కార్యాలయంలో జయశంకర్ జయంతి నిర్వహించారు. ఎంపీపీ మహిపాల్ రెడ్డి, అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు పిల్లి నాగయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోన్: మండలంలోని న్యూవెల్మల్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. రవి, ప్రేమ్‌సాగర్, దత్తాద్రి, భోజన్న తదితరులున్నారు.

దస్తురాబాద్: ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ రాజునాయక్, డిప్యూటీ తహసీల్దార్ తెలంగారావ్, ఆర్ఐలు గంగన్న, వెంకటనర్సయ్య, ఉపసర్పంచ్ గోపి, రాజనర్సయ్య, రాజు, గంగన్న తదితరులు పాల్గొన్నారు.


భైంసాలోని జయశంకర్ కాలనీలో..


నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న పోలీసులు


ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు


దస్తురాబాద్‌లో..


తానూరు పాఠశాలలో..


కడెంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


సారంగపూర్‌లో..


కుంటాల పోలీస్‌స్టేషన్‌లో..

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	100
వంకాయ	80
బెండకాయ	100
పచ్చిమిర్చి	100
కాకరకాయ	100
బీరకాయ	100
క్యారెట్	140
గోరుచిక్కుడు	80
కొత్తిమీర	120
అల్లం	220
ఎల్లిగడ్డ	200
ఉల్లిగడ్డ	35
ఆలుగడ్డ	40

\- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : బ్రో
నారాయణ : బేబీ

వృద్ధుడికి టార్పాలిన్ అందజేత

కడెం: మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో నారి భీమన్న అనే వృద్ధుడు మానసిక వ్యాధితో బాధపడుతూ ఒంటరి జీవితం గడుపుతున్నాడు. ఊరి శివారులో ఉన్న అతడి ఇల్లు శిథిలావస్థకు చేరడంతోపాటు వర్షానికి ఊరుస్తోంది. అదే గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ప్రసాద్ టార్పాలిన్‌ను అందించారు. వర్షానికి తడవకుండా గ్రామస్తుల సాయంతో ఇంటిపై టార్పాలిన్ కట్టించారు.

ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి జన్మదిన వేడుకలు


తానూరులో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


కుభీర్ : మాలేగాంలో వేడుకల్లో నాయకులు


భైంసాలో వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

తానూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిచారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ బొశెట్టి రాజన్న, కోఆప్షన్ సభ్యుడు గోవింద్‌రావ్ పటేల్, సర్పంచ్‌లు విఠల్, పుండలిక్, నాయకులు సూరేకాంత్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండలంలోని మాలేగాం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం రుణమాఫీ చేసినందుకు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణకళ గంగారావ్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలో బీఆర్ఎస్ నాయకులతోపాటు పలు కులసంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు పలువురు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మోచి సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సాయినాథ్, భైంసా అధ్యక్షులు రోహిదాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు చేశారు. అనంతరం కస్తూ రిబాలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ కన్వీనర్ దత్తాద్రి, జెడ్పీటీసీ గంగామణి బుచ్చన్న, వెంకటేశ్, షిర్డీ సాయిబాబా సన్నిధిలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. మాధవ్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొంతల పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్


మొక్క నాటుతున్న చైర్మన్ ఈశ్వర్, తదితరులు

నిర్మల్‌టౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పేర్కొన్నారు. హరితహారంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడ కాలభైరవ స్వామి ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రమణ, అడప పోశెట్టి, ఆలయ కమిటీ అధ్యక్షుడు అడప చిన్ను, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కుంటాలలో..

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్ అందించిన మొక్కలను ఆలయ పరిసరాల్లో కమిటీ సభ్యులు నాటారు. కార్యక్రమంలో సభ్యులు హరికృష్ణ, మోహన్, జుట్టు సుధాకర్, కదార్ల హరిప్రసాద్, తాటి శివ, ఉదయ్, గోవర్ధన్, శివప్రసాద్, ప్రవీణ్, అభిలాశ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టిరోడ్లపై అవస్థలు

- ఏటా వర్షాకాలంలో తప్పని తిప్పలు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- బీటీరోడ్లు నిర్మించాలని వేడుకోలు


వాస్తాపూర్ నుంచి రాంపూర్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి


బురదమయంగా పోతారం-కొరిటికల్ రోడ్డు

మామడ: స్వాతంత్య్రం సిద్ధించి ఏళ్ల గడుస్తున్నా.. ఇప్పటికీ కొన్ని గ్రామాలకు వెళ్లిరావాలంటే మట్టిరోడ్లే దిక్కు. అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లాలంటే నరకయాతన పడాల్సిందే. మామడ మండలంలో 27 గ్రామపంచాయతీలున్నాయి. ఏటా వర్షాకాలంలో మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న మట్టిరోడ్లపై గుంతలు ఏర్పడటంతోపాటు బురదమయంగా మారుతున్నాయి.

మట్టిరోడ్లున్న గ్రామాలివే..

- మండలంలోని పోతారం నుంచి కొరిటికల్ వెళ్లే మార్గంలో ఐదు కిలోమీటర్ల మేర మట్టిరోడ్డు అధ్వానంగా మారింది.
- మండలంలో మారుమూల గిరిజన గ్రామం రాంపూర్ వెళ్లాలంటే వాస్తాపూర్ వెళ్లి నాలుగు కిలోమీటర్ల మట్టిరోడ్డు దాటాల్సిందే.
- మొండిగుట్ట– సోన్‌పేట్ వెళ్లే మార్గంలో రెండున్నర కిలోమీటర్ల మేర మట్టిరోడ్డు బురదమయంగా మారింది. ఇటీవల రూ.నాలుగు లక్షలతో ఈ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించారు. పూర్తిస్థాయిలో బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.
- జాతీయ రహదారి నుంచి పులిమడుగు గ్రామం వెళ్లేందుకు నాలుగు కిలోమీటర్లు దాటాల్సి ఉంటుంది. ఏటా వర్షాకాలంలో మట్టి రోడ్డు నుంచి గ్రామం వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏటా కష్టాలు..

వర్షాకాలంలో మట్టిరోడ్లపై ప్రయాణం సాగించేందుకు అవస్థలు పడాల్సిందే. సంబంధిత అధికారులు స్పందించి మారుమూల గ్రామాలకు బీటీరోడ్లు నిర్మించి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి..



మా గ్రామం నుంచి మామడకు కొరిటికల్ మీదుగా వెళ్తే దగ్గర ఉంటుంది. కానీ మట్టిరోడ్డుపై వర్షాకాలంలో గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. బీటీరోడ్డు నిర్మాణం చేపట్టాలి. – చిన్నయ్య, పోతారం

మా గోస తీర్చాలి



మండలంలోని వాస్తాపూర్ నుంచి రాంపూర్ వెళ్లేందుకు మట్టి రోడ్డు మార్గం సరిగా లేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. బీటీ రోడ్డు నిర్మించి మా గోస తీర్చాలి.

– సంతోష్, సర్పంచ్, వాస్తాపూర్

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో కొన్ని గ్రామాల మధ్య మట్టిరోడ్లు ఉన్నాయి. వీటి నిర్మాణాలు, మరమ్మతులకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూవగానే పనులు జరుగుతాయి. మొండిగుట్ట, సోన్‌పేట్ గ్రామాల నడుమ మట్టి రోడ్డుకు మరమ్మతులు చేయించాం.

– రమేశ్, మామడ ఎంపీడీవో

ఆర్ఎస్ఎస్ కార్యకర్తల సమావేశం


కుభీర్: ఆజాదీకా అమృత్ మహోత్సవాల సందర్భంగా కుభీర్ శ్రీవిఠలేశ్వర మందిరంలో ఆదివారం ఆర్ఎస్ఎస్(రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా ప్రచారక్ భరత్‌కుమార్ కార్యకర్తలతో మాట్లాడారు. పంద్రాగస్టు, రాఖీపౌర్ణమి ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో గ్రామ సమన్వయ సమితులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా కార్యవాహ అరుణ్‌కుమార్, భైంసా నగర ప్రచారక్ అనంతసాయి, ఖండ ప్రముఖ్ పోశెట్టి, ఖండ కార్యకారిణి సభ్యులు శివలింగు, తిరుపతి, కె.శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

ఖానాపూర్: పెంబి మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన అనిల్, మల్లేశ్ ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు భూక్య జాన్సన్‌నాయక్ పరామర్శించారు. శనిగారపు శ్రావణ్, బండి బుచ్చాగౌడ్, శంకర్‌నాయక్, వంశీ ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన గంటా మేఘూరావు మృతి చెందగా.. ఆదివారం బాధిత కుటుంబాన్ని పెంబి జెడ్పీటీసీ భూక్య జానుబాయి పరామర్శించారు. మృతికి కారణాలను తెలుసుకొని బాధితులు ఓదార్చారు. వారి వెంట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్, భూక్య రమేశ్, గోపాల్‌రెడ్డి, సుధాకర్ తదితరులున్నారు.

పాడిరైతులు ఆర్థికంగా ఎదగాలి


మాట్లాడుతున్న తిరుమలేశ్

లోకేశ్వరం: పాడిరైతులు ముద్ర రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని అబ్దుల్లాపూర్ ఎస్బీఐ మేనేజర్ తిరుమలేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని రాజేశ్‌తండా, దుర్గానగర్ తండా, నర్సింహనగర్ తండా, పుస్పూర్ గ్రామాల్లో పాడి రైతులకు ఏర్పాటు చేసి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పాడి పశువుల కొనుగోలుకు ఆసక్తి కల్గిన రైతులు ముందుకొచ్చి బ్యాంకులో దరఖాస్తు చేసుకుంటే.. రుణాలు మంజూరు చేస్తామన్నారు. విజయ డెయిరీలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పాలను విక్రయించి అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చెర్మన్ రాజేశ్‌బాబు, ఫీల్డ్ సూపర్‌వైజర్ దండే రమేశ్, పాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

యోగా సమితి ఆధ్వర్యంలో యజ్ఞం


సామూహిక యజ్ఞంలో పాల్గొన్న మహిళలు

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహనగర్‌లో ఉన్న నర్సింహ కల్యాణ మండపంలో ఆదివారం సామూహిక యజ్ఞం నిర్వహించగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళా పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ప్రారంభించిన మూడు రోజుల శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. యోగా సమితి ప్రాంత ప్రభారి మంజూశ్రీదేవి మాట్లాడుతూ యజ్ఞంతో పరిసరాల్లోని హానికారక సూక్ష్మక్రిములు నశించి.. తద్వారా ఆరోగ్యకర జీవనం అలవడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్మల్, కరీంనగర్ జిల్లాల ప్రభారిలు శోభా మంధని, అలకనందకర్వా, సేవా భారతి జిల్లా అధ్యక్షుడు శ్యాం మంధని తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

ప్రమాదకరంగా ట్యాంక్



లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్డిపై ఏర్పాటు చేసిన నీటి ట్యాంక్ ప్రమాదకరంగా మారింది. కింద పడుతుందేమోనని విద్యార్థులు భయపడుతున్నారు. మనఊరు-మనబడి కింద పాఠశాలలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్.. ట్యాంక్‌ను సరి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: చంద్రకాంత్, లోకేశ్వరం ఎంఈవో, **ఫోన్:** 95029 36560